తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## సింహ వాహనంపై ద్రౌపదమ్మ దర్శనం



శ్రీకాళహస్తి, జూలై 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఆదివారం సాయంత్రం అగ్నిగుండం తరువాత రాత్రి ద్రౌపదమ్మ అమ్మవారు చక్కగా ముస్తాబు చేసుకుని గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో కార్యక్రమాలతో భక్తజనంతో ఆలయ ఆవరణ సందడిగా మారింది. ఉత్సవానికి భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ద్రౌపదమ్మ అమ్మవారిని బంగారుసంహావాహనంపై ప్రతిష్టించి మేళ తాళాలు మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంను ఆలయ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం, పర్యవేక్షకులు దుర్గా ప్రసాద్, ఎంఎస్‌రెడ్డి వెంటరాగా కన్నుల పండువగా గ్రామోత్సవం జరిగింది.

## భాకరాపేట ఘాట్‌లో కారు, టాటాఏస్ ఢీ

### లోయలోకి దూసుకుపోయిన వాహనం

చంద్రగిరి, జూలై 26 ప్రభాతవార్త:





భాకరాపేట ఘాట్ రోడ్డులో శనివారం రాత్రి కారు, టాటా ఏస్ ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. పోలీసు వివరాల మేరకు.. తిరుపతి నుండి పీలేరు వైపుకు వెళుతున్న కారు రొంపిచెర్ల నుండి తిరుపతికి వస్తున్న టాటా ఏస్ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో కారు ప్రయాణిస్తున్న రాజశేఖర్ రెడ్డి, శ్రీదర్ నాయుడు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో కారును ఢీకొట్టిన టాటా ఏస్ ప్రమాద ధాటికి ప్రక్కనే వున్న సుమారు 20 అడుగుల లోతు లోయలోకి దూసుకుపోయింది. ఇందులో వస్తున్న ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. ఎస్ఐ అరుణాచలం కేసు దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు.

# భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

### - పోటెత్తిన భక్తజనం





ద్రౌపదీ అమ్మవారి వడిలో నిప్పు కణికలు కడుతున్న పూజారి, అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నిర్వహించే ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. కన్నుల పండవగా అగ్నిగుండ ప్రవేశాన్ని జరిపారు. భక్తులు గోవింద నామ స్మరణతో, పసుపు పచ్చదనంతో కైలాసం పులకించింది. గెరిగె రాకముందే అమ్మవారిని అగ్నిగుండం వద్దకు తెచ్చి ప్రతిష్టించారు. పూజలు జరిపిన తరువాత గుండం చుట్టూ గుమ్మడికాయలు, పెరుగు, పెరుగన్నం, కర్పూరం వెలిగించారు. అగ్నిగుండంలో మొదట పూల బంతిని వేసిపూజారి ప్రవేశంచేశారు. అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండంలో ప్రవేశించారు. సుమారు నాలుగువేల ఐదు వందల మంది భక్తులు కంకణం కట్టుకోకుండా ప్రవేశించారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా ఆలయ నిర్వాహకులు భక్తులుకూర్చొటానికి గ్యాలరీని ఏర్పాటు చేసారు.

**ఎటు చూసినా అలంకారాలే:**

శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎటు చూసినా పసుపుపచ్చబట్టలు, తలకు పూలపాగా, చేతిలో వేపమండ, చక్కగా గంధం అలంకారంతో అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు కనిపించారు. సాధారణంగా అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు దేవస్థానాలో పేర్లు నమోదు చేసుకొని కంకణంధరించి ప్రవేశించేవారు. ఏ ఏడాదికా ఏడాది అగ్నిగుండం ప్రవేశం చేసే భక్తుల సంఖ్య గణనీయంగాపెరిగింది. ధర్మరాజుల స్వామి ఆలయాభివృద్ధికి ఎప్పుడికప్పుడు పాలకులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో అగ్నిగుండం ప్రక్కన బురదమయంగా మారేది. ఈ సమస్యను పరిష్కరించుటకు చుట్టూ ఫ్లోరింగ్ చేశారు.

**శాస్త్రోక్తంగా ఏడు స్నానాలు:-**

అగ్నిగుండ ప్రవేశానికి ముందుగెరిగె వస్తుంది. పోతురాజు పట్టణంలో ఊరేగిన తరువాత ఉదయం నుంచి ఏడుచోట్ల స్నానమాచరించడం ఆనవాయితీ. ఉదయం ఆలయపూజారులు, వేదపండితులు, పాలకులు రాగా ఈశాన్య మూల ఏర్పాటు చేసిన హోమం నుంచి నిప్పు కణితలను తీసుకొచ్చి అగ్నిగుండాన్ని రగిలించారు. సాయంత్రం వరకు వరకు నిప్పులను రగిలించారు. అక్కడ అగ్నిగుండం రగులుతుంటే గెరిగె, పోతురాజులు ఏడు సార్లు స్నానాలు ఆచరించారు.

తరువాత రాహుకాలం దాటిన తరువాత ఆరు గంటలకు పట్టణంలో ప్రదక్షిణలు చేసుకొని రాగా అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. అగ్నిగుండంలో మొదట పూజారి దిగగా, తరువాత గెరిగె, పోతురాజుల విగ్రహాలను దింపారు. రాహుకాలం దాటిన తరువాత ద్రౌవదీ అమ్మవారిని చక్కగా ముస్తాబుచేసి అగ్నిగుండం ఎదురుగా తూర్పు అభిముఖంగా ప్రతిష్టించారు. అగ్నిగుండానికి పూజారి, పురుషోత్తం శాస్త్రోక్తంగా పూజలు జరిపి బలిఇచ్చిన తరువాత నిప్పు కణిలకలనుతెచ్చి అమ్మవారిఒడిలో పూలలో కట్టారు. తరువాత గోవింద నామస్మరణతో అగ్నిగుండ ప్రవేశం జరిపారు.

### కూటమి పాలనపై

# ఏమి చెప్పమంటారు 'బాబూ' !?

### - నేటినుంచి తెదేపా ఇంటింటికీ కార్యక్రమం !!

ప్రభాతవార్తప్రతినిధి–తిరుపతి:



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు సోమవారం నుండి 45 రోజుల పాటు "ఇంటిం టికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నారు. తనకు అనుచరులు అవసరం లేదని ఇంటింటికి తిరిగి ప్రచారం చేసే నాయకులు కావాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు మరోసారి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో కార్యకర్తల కృషి వల్లే కూటమి అధికారంలోకి వచ్చామని పదేపదే ఘంటాపథంగా చెబుతున్న సిఎం , ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల భావాలను పెంచాలని నాయకులకు టెలీకాన్ఫరెన్స్‌లో నిర్ధేశం చేయడం చర్చకు దారితీసింది. మరీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అయితే ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా మరీ ప్రధానంగా సిఎం చంద్రబాబు సొంత జిల్లాల్లోనే పార్టీ నేతల్లోనేగాక కార్యకర్తల్లోనూ సానుకూల స్పందన కనిపించడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ ఎమ్మెల్యేల తీరుపై పలువురు కార్యకర్తలు వ్యతిరేకంగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఏమని చెప్పమంటారు ...బాబూ అంటూ వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. ప్రధనాంగా తిరుపతి నియోజకవర్గంకు సంబంధించి సీనియర్లను కాదని పార్టీలో ఇటీవల చేరిన వారికి పదవులు ఇవ్వడం, కనీసం ప్రజల సమస్యలు వినిపించుకుని పరిష్కరించడంలో కేడర్ నేతలు తప్పదన్నట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతూన్నాయి. తిరుపతి నగరంలో వైసిపి నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్ రెడ్డి గతంలో అధికారంలో ఉన్నపుడు మాస్టర్‌ప్లాన్ పేరుతో అనేక చోట్ల జనానికి అనుకూలంగా విశాలమైన రోడ్లు వేశారు. ఆ రోడ్లతో నగరంలో చాలావరకు యాత్రికులు, తిరుపతి జనం ఉపయోగమేనని మాటలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుపతిలో చాలా ప్రాంతాల్లో, కాలనీల్లో రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదని, అక్కడ మట్టికూడా వేయలేకపోతున్నారని ఎద్దేవా చేస్తున్నారు. ఇక స్థానికంగా జనసేన పార్టీ ఎమ్మెల్యే శ్రీనివాసులు పార్టీలో కార్యకర్తలను ,ఓట్లేసిన జనాన్ని, జనం సమస్యలను వినిపించుకుని పరిష్కరించలేకపోతున్నారనేది ఆరోపణలు బలంగా ఉన్నాయి. అంతేగాక టిడిపి నాయకులను, ఆ పార్టీ శ్రేణులను పట్టించుకోవడం లేదని గుప్పుమంటున్నారు. ఆధ్యాత్మిక నగరంలో భూ కబ్జాలు, గంజాయి మాఫియా, రౌడీయిజం పెరిగి పోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇంటిపట్టాలు, భూసమస్యలపైనే జనం అవస్థలు పడుతున్నారు. ఇక ఇదే రీతిలో జి డి నెల్లూరు నియోజక వర్గంలో మాజీ ఉప ముఖ్య మంత్రి కె నారాయణ స్వామి పెనుమూరులో 50 పడకల ఆసుపత్రి, టిటిడి కళ్యాణ మండపం మంజూరు చేయించారనేది అక్కడ వినిపిస్తున్న జనం మాట. బస్టాండు కాంప్లెక్సు నిర్మించారు. కలికిరి కొండను టిటిడికి స్వాధీనం చేయడంలో కీలక పాత్ర పోషించారు. వెదురుకుప్పంలో డిగ్రీ కళాశాల నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే థామస్ చెప్పుకోదగ్గ ఒక అభివృద్ధి చేయలేదని జనం అంటున్నారు. ఇలాగే శ్రీకాళహస్తి, నగరి, పూతలపట్టు, పలమనేరుతోబాటు తిరుపతి జిల్లాలో ఉన్న వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాలు జిల్లాలోని ప్రతి నియోజక వర్గంలో ప్రజలు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వంపై అసహనం, విమర్శలు చేస్తున్నారు. అదే రీతిలో పార్టీకి పనిచేసిన సీనియర్ నాయకులను విస్మరించి తగిన గుర్తింపు ఇవ్వక పోవడం కూడా ఇప్పుడు అసంతృప్తులతో బాహాటంగానే వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. ప్రభుత్వ విజయాలను, హామీల అమలును ప్రజలకు వివరించాలని పార్టీ నేతలకు చంద్రబాబు నిర్దేశం చేయడం వెనుక మాత్రం నేతలు పెదవి విరుస్తున్నారు. మరీ ప్రజలు కూటమి పార్టీలో టిడిపి నేతలను, మంత్రులను, ఎమ్మెల్యేలను చివరకు బూత్ స్థాయి కన్వీనర్లను ఎలా స్వాగతించి ఆదరిస్తారనేది

## నేటి నుంచి నారా భువనేశ్వరి పర్యటన

### మహిళలు.. విద్యార్థులతో ముఖాముఖి..

### ఎన్టీఆర్ ట్రస్ట్‌చే సేవా కార్యక్రమాలు !!



కుప్పం, జూలై 26 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 27నుంచి 30వతేది వరకు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కుప్పం ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రతి మూడు నెలలకు ఓసారి నారా భువనేశ్వరి కుప్పంలో పర్యటించి ఇక్కడి ప్రజల కష్టసుఖాలు, సాధక బాధలు తెలుసుకుని వాటి పరిష్కారంకు చొరవ చూపుతున్నారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. తన నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఈసారి మొదటి రోజు రామకుప్పం మండలంలోని అటవీ సరిహద్దు గ్రామాల్లో ఉన్న మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. అలాగే కావలి మడుగు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం అవుతారు. నాలుగు రోజుల పర్యటనలో మహిళలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా కుప్పంలో చేపడుతున్న ఆలయాల అభివృద్ధికి సంబంధించి నిర్వాహకులతో సమావేశం అవుతారు. అదేవిధంగా మృతి చెందిన తెదేపా సీనియర్ నాయకుల కుటుంబాలను కలసి పరామర్శిస్తారు. చివరి రోజు కుప్పం టిటిడి కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున సేవా కార్యక్రమాల్లో లబ్దిదారులకు వివిధ రకాల లబ్ది చేకూర్చనున్నారు. సోమవారం నారా భువనేశ్వరి తొలిరోజు పర్యటన వివరాలిలా .. 27వతేది ఉదయం9గంటలకు కడపల్లి వద్ద ఉన్న స్వగృహం వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం దండికుప్పం మీదుగా రామకుప్పం మండలం కెంచనబల్ల చేరుకుంటారు. అక్కడ యూనిట్ ఇన్‌చార్జ్ చంద్రారెడ్డి నివాసంకు వెళ్తారు. అనంతరం ననియాల ఎకో టూరిజం సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం కావలిమడుగు ఎస్టీ కాలనీలో ఇంటింటికి వెళ్లే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పిఎంకె తాండా, పంద్యాలమడుగు గ్రామాలకు చేరుకుని అక్కడ మహిళలతో సమావేశవవుతారు. సాయంత్రం 5గంటలకు రామకుప్పం జడ్పీహైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన డైనింగ్‌హాల్ ప్రారంభిస్తారు.

## శ్రీచెంగాళమ్మ ఆలయ అభివృద్ధి కమిటీకి లైన్ క్లియర్

### - మంత్రి ఆనంను కలిసిన తిరుమూరు



సూళ్లూరుపేట, జూలై 26, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెండింగ్లో ఉన్న శ్రీ చెంగాళమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు స్థానంలో అభివృద్ధి కమిటీ వేయాలన్న నిర్ణయానికి తెలుగుదేశం పార్టీ అధిష్టానం వచ్చింది. కమిటీని ఏడు మంది సభ్యులతో ప్రతిపాదిస్తూ దానికి చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత తిరుమూరు సుధాకర్ రెడ్డిని నియమిస్తూ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రభుత్వానికి సిఫారసు లేఖను పంపారు. కాగా ఈ సిఫారసు లేఖ పంపినప్పటికీ ఇంత వరకు ఎటువంటి నియామకల విషయమై సమాచారం లేదు. దీంతో తిరుమూరు సుధాకర్ రెడ్డి ఈ విషయమై గత వారం రోజులు క్రితం విజయవాడకు వెళ్లి పార్టీకి చెందిన పలువురు ఆగ్ర నేతలను కలసి అభివృద్ధి కమిటీని త్వరగా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని నెల్లూరులో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి వెళ్లి తిరుమూ సుధాకర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా శ్రీ చెంగాళమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ త్వరగా వేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి అభివృద్ధి కమిటీని త్వరలోనే నియమించడం జరుగుతుందని తెలిపారు. మరోవైపు అభివృద్ధి కమిటీ నియామకంలో ఒక వర్గానికే చోటు కల్పించడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శ్రీ చెంగాళమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు విషయంలో కోర్టు కేసులు ఉండడంతో ప్రస్తుతానికి అభివృద్ధి కమిటీతోనే సరిపెట్టి అన్ని పనులు కమిటి ద్వారానే చేయాలని ఆలోచనతో పార్టీ పెద్దలు ఉన్నారు. ఈ కమిటీ ఏర్పడిన తర్వాత ఎంతవరకు దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తారో తెలియాల్సి ఉంది.

## అమరవీరుల త్యాగాలను దేశం ఎన్నటికీ మరువదు

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

### దేశభక్తి జ్యోతిగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

### వెరిటాస్ సైనిక్ స్కూల్ ఆధ్వర్యంలో భారీ మార్చ్‌పాస్ట్..

### 200 మంది క్యాడెట్లతో అమరవీరులకు ఘన నివాళి





తిరుపతి విద్య జూలై 26 ప్రభాత వార్త

కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వెరిటాస్ సైనిక్ స్కూల్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఆదివారం దేశభక్తి, జాతీయ స్ఫూర్తితో ఘనంగా నిర్వహించారు. భారత సాయుధ దళాల శౌర్యం, సాహసం, త్యాగాలను భావితరాలకు చాటిచెప్పేలా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం దేశభక్తి వాతావరణంలో సాగింది. టీటీడీ పరిపాలనా భవనం నుంచి ఎన్‌జీవో కాలనీలోని అమర్ జవాన్ స్మారక స్థూపం వరకు నిర్వహించిన భారీ మార్చ్‌పాస్ట్‌లో వెరిటాస్ సైనిక్ స్కూల్‌కు చెందిన 200 మంది క్యాడెట్లు క్రమశిక్షణతో పాల్గొన్నారు. పాఠశాల బ్యాండ్ వినిపించిన దేశభక్తి గీతాల నడుమ జాతీయ పతాకాలు చేతబట్టి క్యాడెట్లు అడుగులు కలుపుతూ సాగిన మార్చ్‌పాస్ట్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ర్యాలీ మార్గమంతా "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో దేశభక్తి ఉట్టిపడింది. కార్యక్రమానికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, కార్గిల్ యుద్ధ వీరుడు, వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డా. బి. శేషారెడ్డి, పాఠశాల డీన్ ఎయిర్ కమోడోర్ సి.జి.హెచ్. ఖాన్ (విరమణ) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు సుమారు 200 మంది మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం అమర్ జవాన్ స్మారక స్థూపం వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాల మౌనం పాటిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, 1999 కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన అపూర్వ పరాక్రమం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత సైనికుల సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తిని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈజీ సెంటర్ (మద్రాస్ సాపర్స్) కమాండెంట్ నుంచి వెటరన్ అచీవర్స్ అవార్డు అందుకున్న కార్గిల్ యుద్ధ వీరుడు, వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డా. బి. శేషారెడ్డిని అతిథులు ఘనంగా సన్మానించి అభినందించారు. సైన్యంలో విశిష్ట సేవలతో పాటు పదవీ విరమణ అనంతరం యువతలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించే దిశగా ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. మాజీ సైనికులు తమ అనుభవాలను క్యాడెట్లతో పంచుకోవడం ద్వారా దేశసేవ గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, త్యాగనిరతి, సేవాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, కార్యక్రమం దేశభక్తి సందేశాన్ని సమాజానికి చాటిచెబుతూ విజయవంతంగా ముగిసింది.

## జాడలేని నైరుతి రుతుపవనాలు

### ఎల్‌నినో ప్రభావంతో వేడిగాలులు

### రైతుకు పంట బీమా పథకం ఒక్కటే దిక్కు

చిత్తూరు, జులై 26 ప్రభాతవార్త:

సముద్ర ఉపరితలంపై వేడి గాలులు వీస్తుండటంతో జులై నెలాఖరు కావస్తున్న నైరుతి రుతుపవనాల జాడ కన్పించని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో మే నెలాఖరు నుండి వర్షాలు ప్రారంభం కావాల్సి వుండగా జూన్ నెలలో జిల్లా వైపు వరుణుడు ఏ మాత్రం కరుణ చూపలేదు. అదే పరిస్థితి జులై నెలలో సైతం కొనసాగుతుంది. జిల్లాపై ఎల్‌నినో ప్రభావం వుంటుందని ముందే గ్రహించిన ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేయాల్సి సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను సైతం పంపిణీ చేయలేదు. అయితే ప్రభుత్వం కేటాయించిన వేరుసెనగ సబ్సిడీ విత్తనాలు జిల్లాకు నిజంగానే రాలేదా! లేక జిల్లా రైతుల పేరు చెప్పుకుని ఎవరైనా అక్రమాలకు పాల్పడ్డారా! అనే విషయాలపై వ్యవసాయశాఖ నుండి ఇప్పటి వరకు క్లారిటీ లేదు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో కేవలం ఏడు మండలాలకు మాత్రమే సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను పంపిణీ చేశారు. మిగిలిన మండలాలకు రావాల్సిన వేరుసెనగ విత్తనాలు ఏమయ్యాయి! అనే విషయంపై వ్యవసాయ శాఖ నుండి సమాధానం లేదు. ఈ పరిస్థితుల్లో బోరు బావుల ఆధారంగా సాగు చేసిన ఉద్యాన, వ్యవసాయ పంటలను ఎల్‌నినో ప్రభావం నుండి ఎలా రక్షించుకోవాలనే విషయంపై రైతుల్లో ఆందోళన నెలకొంది. పంటల సాగుకు ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన వర్షాలు నమోదు అయ్యే అవకాశం కన్పించకపోవడంతో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పంటల బీమాను ప్రోత్సహిస్తున్నారు. 'పునర్‌వ్యవస్థీకరణ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం(డబ్ల్యుబిసిఐఎస్)-ఖరీఫ్ 2016'ను పక్కాగా అమలు చేయడానికి ఇఫ్కో(ఐఎఫ్ఎఫ్‌సిఒ)-టోక్యో(టిఒకెవైఒ) జనరల్ ఇన్సురెన్స్ కంపెనీని ఎంపిక చేశారు. అకాల వర్షపాతం, తీవ్ర ఉష్ణోగ్రతలు, గాలి దుమారం వంటి సహజ కారణాల వల్ల పంట నష్టపోయిన రైతులకు బీమా కవరేజ్, ఆర్థిక సహాయం అందించడం జరుగుతుంది. అలాగే చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 3,500 హెక్టార్ల విస్తీర్ణం మేరకు 10,500 మంది రైతులు టమోటా సాగు చేస్తున్నారు. టమోటా పంట రైతులకు ఇన్సురెన్స్ ప్రీమియం చెల్లింపు రేటు 5 శాతంగా నిర్ణయించారు. అంటే ఒక హెక్టారు టమోటా పంట సాగు చేసిన రైతు తన ఇన్సురెన్స్ వాటాగా రూ.3,750 చెల్లించాల్సి వుంటుంది. టమోటా పంట సాగు చేస్తున్న రైతుల సౌకర్యార్థం పంట బీమా చెల్లింపు గడువు ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించడం జరిగింది. ఈ మేరకు రైతులు పంట బీమాను చెల్లించి పూర్తి పంట నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## విద్యుత్‌షాక్‌కు గురై రైతు మృతి



గుడుపల్లె, జూలై 26 ప్రభాతవార్త

గొర్రెలను మేతకు తీసుకెళ్లి వరి పొలంలో కాళ్లు కడుగుతున్న ఓ రైతుకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని సదానందపురం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. జోగ్యానూరు గ్రామంకు చెందిన వెంకటేశు (55) ఆదివారం గొర్రెలు మేపేందుకు తీసుకెళ్లి సమీపంలో ఉన్న పొలంలో కాళ్లు కడిగేందుకు దిగాడు. ఒక్కసారిగా అతనికి విద్యుత్ షాక్ తగలడంతో పొలంలోనే కుప్పకూలాడు. విషయం తెలు సుకున్న స్థానికులు పెద్ద ఎత్తున పొలం వద్ద గుమికూడారు. మృతుడి కుటుంబీకులు భోరున విలపించారు. వెంకటేశు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26 CTR 2:26 CTR 2.qxd 7/26/2026 11:14 PM Page 1



## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

– కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, జులై 26 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు సకాలంలో హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించచి వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారి సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అధికారులు అందరు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

## విజయానికి సమర్థ నాయకత్వం పునాది

– మేజర్ జనరల్ పాల్ దీపక్ నాయుడు



**చిత్తూరుహెల్త్, జులై 26 ప్రభాతవార్త:**

విజయానికి సమర్థ నాయకత్వం ఒక్కటే పునాది అని భారత సైన్యంలో విశిష్ట సేవలు అందించిన మేజర్ జనరల్ పాల్ దీపక్‌నాయుడు పేర్కొన్నారు. అపోలో యూనివర్సిటీలో ఆదివారం అపోలో నాలెడ్జ్ సిటీ లీడర్‌షిప్ క్లబ్ నిర్వహించిన 'లీడర్‌షిప్ టాక్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మేజర్ జనరల్ పాల్ దీపక్‌నాయుడు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం ద్వారా జీవితంలో అత్యున్నత విజయాలను సాధించవచ్చున్నారు. అలాగే నిజమైన నాయకుడు ముందుండి నడిపించడమే కాకుండా తన బృందానికి స్ఫూర్తినిచ్చే వ్యక్తి కావాలన్నారు. నాయకత్వం అనేది కేవలం అధికారానికి పరిమితం కాదని, బాధ్యత, నిజాయితీ, సేవాభావం, సమయపాలన, క్రమశిక్షణ వంటి విలువలను ఆచరణలో చూపించడమే నిజమైన నాయత్వమన్నారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని, క్లిష్ట పరిస్థితుల్లోను ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సైన్యంలో తన అనుభవాలను విద్యార్థులతో ఆయన పంచుకుంటూ దేశసేవలో నాయకత్వం ఎంత కీలకమో ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమానికి అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్కర్ ముఖ్య పరిరక్షకులుగా, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ జె.అగస్టీన్ పరిరక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మేజర్ జనరల్‌కు వైస్ ఛాన్సలర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ బాలరాజ్, డీన్‌లు, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అధ్యాపకబృందం,లీడర్‌షిప్‌క్లబ్‌సభ్యులు, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా యువత

### – ఎస్ఆర్‌పురంలో 3కె రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్




**శ్రీరంగరాజపురం, జులై 26 ప్రభాతవార్త:**

చెడు వ్యసనాలకు దూరంగా యువత వుండాలని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ పిలుపునిచ్చారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చిత్తూరు–పుత్తూరు రహదారిలోని పిళ్ళారికుప్పం క్రాస్ నుండి పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించిన 3కె రన్‌లో ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్, కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్, జిల్లా తెలుగుదేశం నాయకులు గంధమనేని రాజశేఖర్‌నాయుడులు 3కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో యువత పోలీసులుగా మారి గుట్కా, గంజాయి, డ్రగ్స్, ఇంజెక్షన్స్ తదితర సమాచారంను పోలీసులకు అందించాలన్నారు. పోలీసు యంత్రాంగంకు యువత సిక్రెట్ పోలీసులుగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం యువత సెల్‌ఫోన్లకు అలవాటు పడి అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. గతంతో యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ప్రస్తుతం యువత సెల్‌ఫోన్లకు అలవాటు పడి బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నారన్నారు. సెల్‌ఫోన్లు అతిగా ఉపయోగిస్తే మెదడు నుండి వచ్చే నరాలు బలహీనం అవుతాయని, విపరీతంగా తలనొప్పి వస్తుందన్నారు. 3కె రన్‌లో విజేతలుగా నిలిచిన వారికి ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలోవెదురుకుప్పం,పాలసముద్రం, ఎస్ఆర్‌పురం ఎస్ఐలు, తెలుగుదేశం నాయకులు గుండయ్య, భాస్కర్‌నాయుడు,రాజశేఖర్‌నాయుడు, జలంధర్‌నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్టుషాపులపై మెరుపుదాడులు



**గుడిపాల, జులై 26 ప్రభాతవార్త:**

చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ ఆధ్వర్యంలో వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌నాయుడు పర్యవేక్షణలో గుడిపాల మండలంలో ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో బెల్టు షాపులపై పోలీసులు మెరుపుదాడులు చేశారు. ఈ దాడుల్లో పోలీసులకు 80 మద్యం బాటిళ్ళు పట్టుబడగా, మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మండల పరిధిలోని కమ్మతిమ్మపల్లి క్రాస్‌లో బెల్టుషాపు నిర్వహిస్తున్న చెంగల్‌రాయులు వద్ద 35 మద్యం బాటిళ్ళు, బలరాం నుండి 30 మద్యం బాటిళ్ళు, మరో వ్యక్తి నుండి 25 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

## రైల్వే కోడూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడుగా ఓరుగంటి అనిల్ కుమార్...

**రైల్వేకోడూరు రూరల్, జులై 26 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు శంకరమఠంలో బ్రాహ్మణ సంఘం వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడుగా ఓరుగంటి అనిల్ కుమార్ శర్మని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా దగ్గుపాటి సతీష్, కార్యదర్శిగా కురివి విశ్వనాథ శర్మ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓరుగంటి అనిల్ మాట్లాడుతూ పెద్దలను గౌరవించి వారి సలహాలు తీసుకొని, ప్రతి ఒక్కరిని కలుపుకొని, సంఘం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బ్రాహ్మణుల ఆప్తుడు, శ్రేయోభిలాషి అయినా మా బావ ఆర్ సి సురేష్ బాబు ఆశీస్సులు ఉండాలని పత్రిక ముఖంగా తెలియజేశారు. నూతన కార్యవర్గం బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి, సాంప్రదాయ, ధార్మిక సామాజిక కార్యక్రమాల నిర్వహణకు అంకితభావంతో పని చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. సంఘ సభ్యులు నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షి ంచారు.

## సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి పూజలు

**రామకుప్పం, జూలై 26 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో నెలకొని ఉన్న శిరిడి సాయిబాబా ఆలయంలో ఈనెల 29న గురు పౌర్ణమి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 29న బుధవారం ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించి, భక్తుల చేత పాలాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించబడుతుందన్నారు. చుట్టుపక్కల గ్రామాలను భక్తాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి దైవ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

– తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు

**కుప్పం, జూలై 26 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో త్వర లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా యువత పనిచే యాలని మండల తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు కోరారు. ఆదివారం గరిగచీనేపల్లి పంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబు చొరవతో కుప్పానికి భారీ పరిశ్రమలు వచ్చాయన్నారు. తద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ విషయంగా గ్రామాల్లో నిరుద్యోగయువతకు వివరించాలన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ చంద్ర, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు నరసింహ, మండల యువత ప్రధాన కార్యదర్శి బాలు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు చిత్తూరులో వైకాపా యువత ర్యాలీ

**కుప్పం, జూలై 26 ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 28న జిల్లా కేంద్ర ం చిత్తూరులో వైకాపా యువజన విభాగం రా ్యలీ నిర్వహిస్తున్నట్లు వైకాపా రాష్ట్ర యువజన విభాగం జాయింట్ కార్యదర్శి భాగ్యరాజ్ ప్రకటనలో తెలిపారు. డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై సిబిఐ విచారణ చేయాలని, అలాగే నిరుద్యోగ భృతి చెల్లించాలని పేర్కొన్నారు. ఈనెల 28న చిత్తూరు గాంధీ సర్కిల్‌నుంచి అంబేద్కర్ విగ్రహం దాకా ర్యాలీ జరుగుతుందన్నారు. యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## భాజపా బలోపేతంకు కృషి చేయాలి

– బిజెపి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు

**కుప్పం, జూలై 26 ప్రభాతవార్త**



కుప్పం నియోజకవర్గంలో భాజపా బలోపేతానికి నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు సూచించారు. ఆదివారం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ హోటల్‌లో బిజెపి సంస్థాగత సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల కమీషన్ నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంపై చర్చించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. ఈసందర్భంగా పలువురు పార్టీలో చేరారు. సమావేశంలో కుప్పం ఇన్‌చార్జ్ తులసినాథ్, ప్రధాన కార్యదర్శులు అట్లూరి శ్రీనివాస్, గొనివారి విజయ్‌కుమార్, నాలుగు మండలాల నేతలు పాల్గొన్నారు.

## నారా భువనమ్మ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**కుప్పం, జూలై 26 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 28న గుడుపల్లె మండలంలో పర్యటించనున్నారు. యామనూరు గ్రామంలో శ్రీ ధర్మరాజులస్వామి ఆలయం వద్ద గ్రామదేవతల ఆలయాల నిర్వాహకులతో సమావేశంలో పాల్గొంటారు. దీ ంతో అక్కడ ఏర్పాట్లను ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్ పరిశీలించి స్థానిక నేతలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుబ్బు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, గంగమ్మగుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## హెల్మెట్ ప్రాణరక్షణ కవచం : డిఎస్పీ

– హెల్మెట్ ధారణపై భారీ ర్యాలీ !!



**శాంతిపురం, జూలై 26 ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ ప్రాణరక్షణ కవచం అని కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం ప్రజలకు హెల్మెట్ ధారణపై మోడల్ స్కూల్ నుంచి ఎంకెపురం క్రాస్ వరకు సుమారు 300టువీలర్లలో వాహనదారులు హెల్మెట్లు ధరించి ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భ ద్రత నియమాలు తప్పక పాటించాలని ప్రమాదాల నివారణలో భాగసా ్వములు కావాలని సూచించారు. రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ప్రయాణంలో వాహనదారుడు హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం 30మందికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్, గుడుపల్లె ఎస్సై శ్రీకాంత్, నేతలు ఉదయ్‌కుమార్, విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విస్తృతంగా పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

– 15 వాహనాలు సీజ్ చేసిన పోలీసులు



**చిత్తూరు, జులై 26 ప్రభాతవార్త:**

ఎస్పీ తూషార్ డూడి ఆదేశాల మేరకు నాన్ కేడర్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో ధైర్య స్పర్శ–ఆపరేషన్ ఫ్లష్ అవుట్‌లో భాగంగా ఆదివారం పోలీసులు మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు – డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో సరైన పత్రాలు లేని 15 వాహనాలను సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 16 ప్రాంతాల్లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి 50 మందికి డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు పలమనేరు పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో సరైన పత్రాలు లేని 13 వాహనాలు, చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో మరో 2 వాహనాలను సీజ్ చేశారు. అలాగే చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు 115 బాటిళ్ళ క్వాటర్ బాటిళ్ళ మద్యంను సీజ్ చేయగా, గుడుపల్లి మండలంలో 13 లీటర్ల ఎన్‌డిపిఎల్ లిక్కర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 108 మిలీ 15 మద్యం బాటిళ్ళు, జిడినెల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 10 మద్యం బాటిళ్ళు, గుడిపాల స్టేషన్ పరిధిలో 90 మద్యం బాటిళ్ళు, కుప్ప అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 77 మద్యం బాటిళ్ళు, రామకుప్పం పోలీస్ స్టేషన్ పరిధిలో 50 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటలకు సంబంధించి పోలీసులు మూడు కేసులు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే సిఎం లక్ష్యం

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

**కుప్పం, జూలై 26 ప్రభాతవార్త**



కుప్పం ప్రాంతంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందించడమే సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నాయనూరు చెరువు వద్ద 28లక్షలతో మరువ నిర్మాణంకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో రైతుల కోసం ఇప ్పటికే సిఎం చంద్రబాబు కృష్ణాజలాలు తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం, సాగునీటి వనరుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కుప్పానికి గండికోట నుంచి సైతం జలాలు తెచ్చి తాగునీరు అందించాలని సిఎం ఆలోచన అన్నారు. ఇప్పటికే కృష్ణాజలాలతో కుప్పం ప్రాంతంలో 110చెరువులు నిండాయని అన్ని చెరువులను నింపేందుకు అధికారులను ఆదేశించారన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

**కాణిపాకం, జూలై 26 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన ప్రేమ్‌కుమార్ అనే భక్తుడుశాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తా న్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, అర్చకులు, దాత కుటుంబసభ్యులు తదతరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో సినీ నటుడు బెల్లంకొండ శ్రీనివాస్

**కాణిపాకం, జూలై 26 ప్రభాతవార్త:**



ప్రముఖ సినీ నటుడు బెల్లంకొండ శ్రీనివాస్ ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఏఈఓ రవీంద్రబాబు,అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాణిపాకంలో వీణ నాదార్చన

**కాణిపాకం, జూలై 26 ప్రభాతవార్త:**

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో సోమవారం "వీణ నాదార్చన" సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు తెలిపారు. దేవస్థానం ప్రధాన ఆలయంలోని కళ్యాణ వేదికవద్ద విజయవాడకు చెందిన సంకీర్తన సేవా కేంద్రంకు చెందిన 108 మంది కళాకారులచే ఈ'వీణ నాదార్చన' కార్యక్రమంను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో వీణనాదార్చన కార్యక్రమంను నిర్వహించిన వారు సోమవారం కాణిఆపకం ఆలయంలో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించన్నుట్లు తెలిపారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

**రామకుప్పం, జూలై 26 ప్రభాతవార్త**



మండలంలోని గెర్నపల్లి గ్రామంలో త్రాగు నీటి సమస్యను టిడిపి మాజీ మండల అధ్య క్షుడు ఆనంద రెడ్డి పరిష్కరించారు. గత రెం డు రోజుల క్రితం గ్రామంలో నీటి సమస్య తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పరిశీలిం చి అధికారులకు సమస్య విన్నవించి వెంటనే భావి బోరుకు పైపులు అమర్చి సమస్యను పరి ష్కరించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,నరేష్ కుమార్ రెడ్డి, సలాం,బాబు,పంచాయతీకార్యదర్శిఅన్బురాజు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాధికార టీం నాలుగవ వార్షికోత్సవం

**రామకుప్పం, జూలై 26 ప్రభాతవార్త**




రాజ్యాధికారి టీం నాలుగవ వార్షికోత్సవ సంబరాలు సంఘం నేతలు ఘనంగా జరుపు కున్నారు. ఆదివారం మండల కేంద్రంలో అం బేద్కర్ చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరే గిం చారు. గత నాలుగేళ్లుగా మండలంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. రానున్న స్థానిక ఎన్నికలకు అభ్యర్థులుగా రాజాధికారం టీం సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార వ్యవస్థాపకులు నవీన్, టిడిపి నేత కన్నన్, సభ్యులు అశోక్, చరణ్, హరి, ప్రశాంత్, విక్రమ్, ప్రవీణ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ప్రగడ కోటయ్య జయంతి

**చిత్తూరు, జులై 26 ప్రభాతవార్త:**



స్వాతంత్ర్య సమరయోధుడు, చేనేత ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రజా బంధు ప్రగడ కోటయ్య జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చిత్తూరు జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో ఆదివారం ప్రగడ కోటయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా మాట్లాడుతూ ప్రగడ కోటయ్య స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా చేనేత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడన్నారు. ప్రగడ కోటయ్య ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్లమెంటు సభ్యుడిగా ప్రజలకు విశిష్ట సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ సుధాకర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉపయోగ స్థలం విక్రయిస్తున్న కబ్జాదారులు : పట్టించుకోని అధికారులు



వెంకటగిరి, జూలై 26 ప్రభాతవార్త: పట్టణంలోని ఎన్జీవో కాలనీలో పబ్లిక్ పర్పస్ కోసం వదిలిన ఎకరా స్థలాన్ని కొందరు కబ్జాదారులు విక్రయిస్తున్నారు. కొందరి తెలుగు తమ్ముళ్లు పబ్లిక్ పర్పస్ స్థలాన్ని పట్టాలు చేసుకుని ఆ పట్టాలతో పొజిషన్ సర్టిఫికెట్ తీసుకొని బోగస్ రిజిస్ట్రేషన్ చేసి విక్రయాలు సాగిస్తున్నట్లు పట్టణ వాసులు విమర్శిస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ఈ స్థలాన్ని కబ్జాదారులు అధికార బలంతో ఇక్కడ ఇస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. పబ్లిక్ పర్పస్ కోసం ఒకటిన్నర ఎకరా స్థలాన్ని ఇక్కడ కేటాయించారు. మరి ఎక్కడ స్థలంలో సచివాలయం భవనం, వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. మిగిలిన ఎకరా స్థలం ఖాళీగా ఉండడంతో దీనిపై కబ్జాదారుల కన్ను పడింది. సర్వే నంబర్ 1511,1512లో ఉన్న స్థలాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ వారు ఈ స్థలాలను విక్రయిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు కూడా ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయలు విలువచేసే ఈ స్థలాన్ని విక్రయిస్తున్నట్లు ఎన్జీవో కాలనీ విశ్రాంతి ఉద్యోగులు వాపోతున్నారు. తాము మార్కెట్ వ్యాల్యూకే ఎన్జీవో కాలనీలో స్థలాలు కొన్నట్లు తెలిపారు. ఈ స్థలాలను కాపాడాలని ఎన్జీవో లో ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో జూనియర్ కళాశాలకు సంబంధించిన ఒకటిన్నర ఎకరా స్థలాన్ని కూడా బోగస్ రిజిస్ట్రేషన్ తో విక్రయిస్తున్నట్లు తెలిసింది. బొగ్గుల మెట్టలో కూడా ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించే విక్రయాలు సాగిస్తున్నారు. ధర్మపురం, పట్టణంలోని మీ సేవ కేంద్రం పక్కన 48 సెంట్లు ప్రభుత్వ స్థలాలను కూడా ఆక్రమించి భోగ రిజిస్ట్రేషన్‌తో అమ్మకాలు సాగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ వారు భూములను రక్షించాలని ప్రతిరోజు ఆందోళన చేస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా ఫిర్యాదులు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడే వరకు పోరాటం ఆపదని పరిరక్షణ కమిటీ వారు స్పష్టం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేష్‌ను కలిసి ప్రభుత్వ భూముల ఆక్రమణాలపై ఫిర్యాదు చేస్తామని పరిరక్షణ కమిటీ వారు తెలిపారు. భూకబ్జాదారులు పై క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎంకు తెలియజేస్తామని తెలిపారు.

# భారతీయ జనతా పార్టీలో పలువురు చేరిక



తడ, జూలై 26 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం సూళ్లూరుపేట పట్టణం టీవీ ఆర్ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం భారతీయ జనతా పార్టీకి కేటాయించిన సీటుల్లో రానున్న స్థానిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ బలోపేతం కృషి చేయాలని సర్ ఓటర్ వెరిఫికేషన్ గురించి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. తడ మండల బిజెపి అధ్యక్షులు చిల్లకూరు తేజరెడ్డి ఆధ్వర్యంలో తడ మండలంలో కాదలూరు పంచాయతీ నుండి వేలూరు మునస్వామి, విజయ్, మాంబట్టు పంచాయతీ నుండి నెల్లిపూడి మధురెడ్డి భారతీయ జనతా పార్టీలో చేరారు. సన్నారెడ్డి దయాకర్ రెడ్డి నాయకులకు భారతీయ జనతా పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో క్రమశిక్షణతో మెలగాలని పార్టీ బలోపేతాని కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి చిల్లకూరు తేజరెడ్డి, కృష్ణమూర్తి, చెంచు కృష్ణయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు

# ఉచిత మంచినీటి సరఫరా ట్యాంకర్లు ప్రారంభం



సూళ్లూరుపేట, జూలై 26 ప్రభాతవార్త: పట్టణములో ప్రస్తుతం కనుక్కొని ఉన్న మంచినీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ప్రముఖ పారిశ్రామిక కొండేపాటి గంగా ప్రసాద్ సహకారంతో ఏర్పాటు చేసిన మంచి నీటి ట్యాంకర్లను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ లాంఛనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పారిశ్రామిక గంగాప్రసాద్ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడు ముందుంటారని ఆయన గత 24 సంవత్సరాలుగా సూళ్లూరుపేట పట్టణంలో ఉచితంగా మంచినీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ఈ ట్యాంకర్లు పట్టణంలోని సూళ్లూరు,కస్వా రెడ్డిపాలెం, సాయినగర్ గిరిజన కాలనీ,కోళ్ల మిట్ట,బాపూజీ కాలనీలో మంచినీటి సరఫరాను అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, చిట్టేటి పెరుమాళ్ళు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు సూర్య ప్రకాశరావు, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమరానికి సిద్ధం కండి : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, జూలై 26, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు త్వరలో జరగనున్న స్థానిక సంస్థలఎన్నికలకు సిద్ధం కావాలని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు.ఆదివారం పట్టణంలోని శ్రీ సత్య సాయి కళ్యాణ మండపంలో నిర్వహించిన సూళ్లూరుపేట పట్టణ బిఎల్ఎల సమావేశంలో ఆమె పాల్గొన్నారు.పార్టీలోని ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసిస్థానిక ఎన్నికల్లో సత్తా చూపాలని చెప్పారు. బూత్‌ల వారిగాఉన్న బిఎల్ఎలు వారి పరిధిలో ఓటర్ల చేర్పులు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరే విధంగా ప్రచారాన్ని చేపట్టడంతో పాటు చైతన్యవంతులు చేయాలని తెలిపారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకు సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో పట్టణంలోని బూత్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సి ఎస్ చైర్మన్ ఎజి కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ ఒడ్డి, పచ్చ మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

# సంస్థగతంగా పార్టీ బలోపేతం కావాలి

**- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి**




సూళ్లూరుపేట, జూలై 26 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజకవర్గంలో పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకుప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టివిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన బిజెపి సంస్థ గతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం బిఎల్ఓగా ఉన్నవారు బూత్ స్థాయి నుంచి పార్టీ మరింత బలోపేతం చేసేందుకుదృష్టి సారించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి విస్తృతంగా ప్రచారం చేయడం వాటిని బలంగా ప్రజలకు చేరే విధంగా కృషి చేయడం కార్యకర్తల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు నరేందర్ రెడ్డి, రాచర్ల కృష్ణమూర్తి, బెజవాడ విజయమ్మ, ఆరణి విజయభాస్కర్ రెడ్డి, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, అరణికిషన్‌రెడ్డి, నూతలపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగడ కోటయ్య చేనేతకు సేవలు మరువలేనివి

**- అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్**



వెంకటగిరి, జూలై 26 ప్రభాతవార్త: ప్రగడ కోటయ్య చేనేత పరిశ్రమకు చేసిన సేవలు మరువలేమని అడిషనల్ డైరెక్టర్, చేనేత శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ ప్రభాకర్ తెలిపారు. ప్రగడ కోటయ్య స్మారక ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు వారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ కోటయ్య చేనేత పరిశ్రమకు చేసిన సేవలను కొనియాడారు. ఈ ఇన్స్టిట్యూట్‌కు ప్రగడ కోటయ్య పేరును పెట్టినట్లు తెలిపారు. ప్రగడ కోటయ్య ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యులుగా సేవలందించినట్లు తెలిపారు. జయంతిని పురస్కరించుకొని ప్రగడపాటి మెమోరియల్ ఇండియన్ టెక్నాలజీ పూర్వ విద్యార్థుల సంఘం వారు విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన గొయ్యి

**- పట్టించుకోని ఆర్అండ్‌బి అధికారులు**



వెంకటగిరి, జూలై 26 ప్రభాతవార్త: పట్టణంలోని త్రిభువని డీలక్స్ సినిమా హాల్ కోడలు వద్ద రోడ్డు పక్కన పెద్ద గుంట పడి ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పోతున్నారు. వర్షం నీటి ప్రవాహానికి రోడ్డు మొత్తం పోయి గుంట పడి ఉంది. నిత్యం ఈశ్వరయ్య టీ స్టాల్ వద్ద వందల మంది వచ్చి టీ తాగుతుంటారు. వాహనాల వారు అదుపు తప్పితే గుంటలో భయపడతారు. కొన్ని నెలలుగా రోడ్డు పక్కన గుంట పడి ఉన్న ఆర్అండ్‌బి అధికారులు కానీ, మున్సిపాలిటీ వారు కానీ పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు పక్కనే మురుగు కాల్వ కూడా ఉంది. రోడ్డు మొత్తం కోసుకొని పోయి గుంట పడింది. ఉన్నతాధికారులైన చర్య తీసుకుని రోడ్డు పక్కన గుంటపొడించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## రాధా రంగా మిత్ర మండలి నూతన కార్యవర్గం



వెంకటగిరి, జూలై 26 ప్రభాతవార్త: వెంకటగిరి నియోజకవర్గానికి రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి సంబంధించిన నూతన కార్యవర్గాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల సమన్వయంతో రాష్ట్ర అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు బుల్లెట్ ధర్మారావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. గౌరవ అధ్యక్షులుగా తోట కృష్ణయ్య, నియోజకవర్గ అధ్యక్షులు మణి, పార్లమెంట్ అధ్యక్షులు ధనంజయ, మహేష్, తిరుపాలు, ధనుంజయ, శిరీష తదితరులు వివిధ బాధ్యతలకు ఎన్నికయ్యారు.మరెన్నో విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు గౌరవాధ్యక్షులు తోట కృష్ణయ్య అభినందించారు.

## వ్యవసాయ పొలాలకు గ్రావెల్ రోడ్లు : ఏపీవో

బాలాయపల్లి, జూలై 26 ప్రభాతవార్త: విబిజి రాంజీ పథకం ద్వారా గ్రామాల్లో ఉన్న వ్యవసాయ పొలాలకు గ్రావెల్ రోడ్లను నిర్మిస్తున్నట్లు ఆ పథకం ఏపీవో జ్యోతి తెలిపారు. 2026-27 సంవత్సరాలగాను పంచాయతీరాజ్, విబిజి రాంజీ పథకం ద్వారా రోడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పదివేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి, జూలై 26 ప్రభాతవార్త: ఆగస్టు నెల 16వ తేదీ ఆదివారం ఫరస కస్తూరి అమ్మ ఆరో వర్ధంతి సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం తెలిపారు. మెగా వైద్య శిబిరం ఉదయం తిరుపతి మున్సిపల్ హైస్కూల్ నందు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందిస్తామని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మహాదేవయ్య నగర్‌లో కార్డెన్ సెర్చ్



సూళ్లూరుపేట, జూలై 26 ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు పర్యవేక్షణలో పట్టణంలోని మహదేవయ్య నగర్‌లో సీఐ ఎం.మురళీకృష్ణ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవ నగర్‌లో అనుమతి లేకుండా ఉన్న వాహనాలను తనిఖీ చేయడంతో పాటు, సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇదే ప్రాంతంలోని ఆర్అండ్‌బి రహదారిపై వాహనాలను తనిఖీ చేసి లైసెన్సులు, సరైన పత్రాలులేని వారికి జరిమానాలను విధించి సుమారు 65 వేల రూపాయలను వసూలు చేశారు. అలాగే ఆగస్టు ఒకటో తేదీ నుంచి శ్రీ చెంగాళ మతా పరమేశ్వరి దేవస్థానం సమీపంలోని శిథిలావస్థలో ఉన్న కాళంగి నది బ్రిడ్జిపై బస్సులు, భారీ వాహనాల రాకపోకలను నిషేధించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు గంట అజయ్ కుమార్, సుబ్రహ్మణ్య రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రగఢ కోటయ్య జయంతి



పుత్తూరు,జూలై 26 ప్రభాతవార్త: చేనేత ఉద్యమ నాయకులుగా ప్రగఢ కోటయ్య దేశానికి,రాష్ట్రానికి అందించిన సేవలు అసమానమైనవని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమసంఘం ఆదేశాల మేరకు చేనేత పితామహుడు ప్రగఢ కోటయ్య జయంతిని పుత్తూరు మండలం గొల్లపల్లి గ్రామంలో పద్మశాలి సంక్షేమ సేవాసంఘం సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంజి మాధవయ్య మాట్లాడుతూ ప్రగఢ కోటయ్య రాష్ట్ర చేనేత రంగానికి దిశ,నిర్దేశం చేసి,నేతన్నల హక్కుల కోసం పోరాడిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడని కొనియాడారు.చేనేత రంగం అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. అనంతరం కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దుర్గసముద్రంలో వైభవంగా ద్రౌపది కళ్యాణం

**- భక్తులతో కిటకిటలాడిన ఆలయం**



తిరుపతిరూరల్,జూలై 26 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలో ఆదివారం శ్రీద్రౌపదీ కళ్యాణం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శ్రీద్రౌపది సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ కళ్యాణ కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు విశేషంగా హాజరై తిలకించారు. ఉదయం వేళ ఆలయ అర్చకులు మూల విరాట్‌లకు విశేష అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ కళ్యాణ మండపాన్ని పుష్పాలతో అందంగా అలంకరించి, ఉత్సవమూర్తులను కళ్యాణపీటలపై ఆసీనులుగా ప్రతిష్ఠించారు. ఉభయదారులైన వెంకటరమణారెడ్డి, భవనేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాలు ఘోషిస్తూ మంగళ వాయిద్యాల నడుమ ద్రౌపది-ధర్మరాజస్వామి కళ్యాణోత్సవాన్ని కడు కమనీయంగా నిర్వహించారు. ద్రౌపదీ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించుటకు భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. ఆలయంలో అంతా భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కళ్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవంగా వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాదరెడ్డి, కమిటీ సభ్యులు నామునిరెడ్డి, రమేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కపిలేశ్వరుని పవిత్రోత్సవాలు ఆరంభం



తిరుపతి, జులై 26ప్రభావార్త: తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు ఆదివారం వైదిక మంత్రోచ్చారణలు, శైవాగమ సంప్రదాయాలతో ప్రారంభమయ్యాయి. ఆలయం అంతా వేదఘోషలు, మంగళ వాయిద్యాలు, శివనామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. పంచమూర్తులకు విశేష స్నపన తిరుమంజనం నిర్వహించారు. దివ్యాభిషేకాన్ని తిలకించిన భక్తులు పరమశివుని కృపాకటాక్షాలను పొందుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఆలయ అర్చకులు, అధికారులు, పాల్గొన్నారు.

## కార్గిల్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



తిరుపతి, జులై 26ప్రభావార్త: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా తిరుపతిలో అమరవీరులకు బిజెపి ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కపిలతీర్థం సమీపంలోని అమర వీరుల స్తూపం వద్ద బిజెపి నాయకులు పుష్పాంజలి ఘటించారు. బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ 1999లో కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ చొరబాటు దారులను భారత సైన్యం అపూర్వ ధైర్యసాహసాలతో తరిమికొట్టి చారిత్రాత్మక విజయాన్ని సాధించిందన్నారు.బిజెపి సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి,లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, పెరియస్వామి రామకుమార్, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వాసురాయల్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమాలతో జనంలోకి!

**-నేటినుంచి తెదేపా ఇంటింటికీ కార్యక్రమం -చేస్తున్న మంచిని ప్రజలకు తెలిసేలా**

**-సంస్థాగత ఎన్నికలకు సన్నద్ధమయ్యేలా -45 రోజుల పాటు తెలుగుతమ్ముళ్లు క్షేత్రస్థాయిలోనే**

కుప్పం, జూలై 26 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సిఎం, తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి లోకేష్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జూలై 27వతేది నుంచి పార్టీ శ్రేణులు 45 రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటనలకు ఆదేశించారు. శనివారం సిఎం చంద్రబాబునాయుడు సైతం పార్టీ శ్రేణులకు టెలికాన ్ఫరెన్స్‌లో ఈ ఇంటింటికీ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. కుటుంబ సాధికార సభ్యులు మొదలు పార్టీలో ఉన్న నాయకులు అందరూ ఈకార్యక్రమంలో పాల్గొనాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది.దీంతో సోమవారం నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అధికార తెదేపా శ్రేణులు జనంబాట పట్టనున్నారు.

**చేస్తున్న మంచి ప్రజలకు తెలిసేలా :**

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం సిఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారు. ఈ విషయం ప్రజల్లో మరింత బలంగా తీసుకెళ్లాలని పార్టీ అధిష్టానం ఆలోచన. కుటుంబాలకు ఏయే ప్రభుత్వ పథకంలో లబ్ది కలుగుతోందో క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు ఆదేశించారు. ప్రతిరోజు కనీసం ముప్పై కుటుంబాలను కలవాలని పార్టీ ఆదేశించినట్లు తెలిసింది. మరో పక్క ప్రభుత్వ పనితీరుపై సైతం ప్రజల్లో సానుకూలత మరింత పెరిగేందుకు ప్రభుత్వం ఏయే మంచి కార్యక్రమాలు చేపడుతోందో ప్రజలకు సవివరంగా తెలియజేస్తే ఫలితాలు వస్తాయి. ఇప్పటికే సిఎం పార్టీ శ్రేణులకు ఈ విషయంగా స్పష్టమేన ఆదేశాలు ఇచ్చారు. చేసిన మంచిని నోరు తెరచి చెబితేనే కదా? అని ఇటీవల కుప్పం పర్యటనలో సైతం పార్టీ శ్రేణులను ప్రశ్నించారు.

**సంస్థాగత ఎన్నికలకు సన్నద్ధం :**

సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో సంస్థాగత ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్నికల నాటికి పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయాలని తెదేపా అధిష్టానం నిర్ణయించింది. దీంతో పార్టీ యంత్రాంగంను 45 రోజుల పాటు ప్రజల్లోనే ఉండేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సైతం ఇంటింటికీ కార్యక్రమం దోహదపడనుంది.

# ధర్మరాజుల స్వామి ఆవరణలో హోరెత్తిన జనం

**-పొంగళ్ళతో మొక్కులు తీర్చుకున్న భక్తులు**



శ్రీకాళహస్తి, జూలై 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు, పట్టణానికి చెందిన పలు ప్రాంతాలకు చెందిన మహిళలు తండోపతండాలుగా తరలి వచ్చారు. ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలంటే చుట్టపక్కల గ్రామాల ప్రజలకు తిరునాళ్ళుగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏడాది ఇక్కడ దుర్యోధన దుశ్శాసన వధ సందర్భంగా పొంగళ్ళు పెట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది వేలాది మంది మహిళలు పొంగళ్ళు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆవరణలోని మైదానంలో కనీసం ఒక్కసారికి వెయ్యిమంది పొయ్యలు ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది సరిగ్గా వర్షాలు కురవక పోవటంతో జనం పొంగళ్ళు పెట్టటానికి సుముఖత చూపారు. ఆలయ ప్రాంగణం అంతా మహిళా భక్తుల పొంగళ్ళతో కిట కిట లాడింది.

**దేవస్థానం ఏర్పాట్లు:**

పొంగళ్ళు సందర్భంగా ఆలయాధికారులు ముందుజాగ్రత్తగా పలు ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ సారి వినోదాలంది ఒచుటకు వచ్చిన రంగుల రాట్నాల్ని ఆవరణకు దూరంగా ఏర్పాటు చేశారు. అడుగడునా ధర్మకర్తల మండలి చైర్మెన్‌కొట్టె సాయి ప్రసాద్, ఇఓ బికె వెంకటేశులు నిత్యం పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక మజిలి దుకాణాల్ని ఏర్పాటు చేసుకునే వ్యాపారులకు వివిఎంసి సర్కిల్ నుంచి ఆలయం వరకు రోడ్డుపక్కవ ఏర్పాటుకు అనుమతించారు. పోలీసు అధికారులు ముందుజాగ్రత్తగా పిచ్చాటూరు నుంచి వచ్చే బస్సుల్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ వద్ద చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాల్ని సాయిబాబా సన్నిధి నుంచి ఆర్టిసి బస్టాండుకు మళ్ళించారు. వివిఎంసి సర్కిల్ నుంచి ఎలాంటి వాహనాల్ని అనుమతించలేదు. ఏర్పాట్లను ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్,డెప్యూటీ ఇఓ కృష్ణారెడ్డి ఇఇ శ్రీనివాసులు రాజు పర్యవేక్షించారు.

# డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**- నిర్లక్ష్యం కొనసాగితే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష**

**- సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి హెచ్చరిక**



తిరుపతి క్రైమ్, జూలై 27 ప్రభాతవార్త: తిరుపతి నగరంలోని 3వ డివిజన్ పరిధిలో ఉన్న లెనిన్ నగర్, ఈశ్వర్ టవర్స్, బృందావనం, పరిసర కాలనీల ప్రజలు తీవ్రమైన కాలువలు, డ్రైనేజీ సమస్యలతో ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తిరుపతి జిల్లా కార్యదర్శి పి. మురళి డిమాండ్ చేశారు. శ్రీనివాస కళ్యాణ మండపం సమీపంలో దశాబ్దాలుగా ఉన్న ప్రధాన కాలువను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు మట్టితో పూడ్చివేయడం వల్ల మురుగునీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయిందని, ఫలితంగా మురుగునీరు ఇళ్లలోకి చేరడం, సెప్టిక్ ట్యాంకులు నిండిపోవడం, దుర్వాసనతో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవడం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన తెలిపారు. ఈ సమస్య వల్ల వెయ్యికి పైగా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే స్థానిక ప్రజలతో కలిసి విస్తృత స్థాయిలో డోర్‌టుడోర్ ప్రచారం చేపట్టి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షతో పాటు ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని పి. మురళి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు వెంకట సిద్ధులు రవీంద్ర, పి హరి నారాయణ, ఆర్ వెంకటేష్, కృష్ణయ్య, విజయ్ కుమార్, తిరుపాల్, భారతి, ఉమా, సత్తాజ్, ఎల్లమ్మ, బుజ్జమ్మ, భాగ్యమ్మ, గుల్జార్ ఈ ఉద్యమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ వినయ్ పాల్గొని మద్దతు తెలియజేశారు.

26 CTR 5:26 CTR 5.qxd 7/26/2026 11:10 PM Page 1



# దూదేకుల సంక్షేమంపై దృష్టి

## రాజకీయంగా ఎదుగుదల దిశగా అడుగులు




**తిరుపతిరూరల్,జూలై 26 ప్రభాతవార్త:**
రాష్ట్ర నూర్ భాషా/దూదేకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశం కేవలం పరిచయ వేదికగానే కాకుండా సమాజ సంక్షేమం, రాజకీయంగా ఎదుగుదలపై కీలక చర్చలకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్ భాషా తదితరులు మాట్లాడుతూ దూదేకులు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను విపులంగా ప్రస్తావించారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు వంటి అంశాలపై స్పష్టమైన చర్చ జరిగింది. ప్రత్యేకంగా యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై దృష్టి సారించాలని నాయకులు సూచించారు. సమాజానికి తగిన ప్రాతినిధ్యం రాజకీయాల్లో లేదని, దీనిని అధిగమించేందుకు సంఘటితంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకత్వాన్ని అభివృద్ధి చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో చురుకగా పాల్గొనాలని సూచించారు. దూదేకుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కరమల్ల వల్లీ మాట్లాడుతూ దూదేకుల వర్గం రాజకీయంగా బలపడాలంటే యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకురావాలని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, వ్యాపారులకు ఆర్థిక సహాయం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు. దూదేకుల సంఘ తిరుపతి జిల్లా యూత్ అధ్యక్షుడిగా కరమల్ల హుస్సేన్ ఎన్నికను స్వాగతించారు. యువ నాయకత్వం ద్వారా సమాజాని కి కొత్త దిశ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సంఘ ప్రతినిధులు చంద్రగిరి నియోజకవర్గ సమన్వయ కర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసి సమాజ అభివృద్ధికి రాజకీయ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి లాల్ వజీర్, రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ పెద్ద మస్తాన్, కడప జిల్లా అధ్యక్షుడు భాషా, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఇమామ్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బాబర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో మాజీ పూజలు

**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను ఆదివారం భక్తి శ్రద్ధలతో మాజీ ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసులు కుటుంబసభ్యులతో జరిపించుకున్నారు. వారికి బిజెపి నాయకుడు చందు రాయల్ సారథ్యంలో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయ ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు సారథ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. వారు రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్ వెంటనే సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్ వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లను పర్యవేక్షకులు నాగభూష ణం యాదవ్ పర్యవేక్షించారు.

## గుడిమల్లం రోడ్డుకు స్థల పరిశీలన



**ఏర్పేడు,జూలై 26 ప్రభాతవార్త**
గుడిమల్లం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గుడిమల్లం, రా విళ్ళవారి కండ్రిగ గ్రామానికి చెందిన నాయకులు కొత్తరోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన జరిపారు. గుడిమల్లం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను రూపొం దిస్తున్నారు. ఏ ఆలయం కాని పట్టణం కానీ అభివృద్ధికి మొదటి మెట్టు రోడ్డు అని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సూచిస్తూ స్థానికులకు బాధ్యత అప్పగించారు. ఈ నేపథ్యంలో గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయం నుంచి ఇరుగులప్ప చలం వరకు రోడ్డు మార్గాన్ని అధికారులు గ్రామస్తులతో కలసి పరిశీలించారు. గుడిమల్లంకు వస్తున్న భక్తులు ఒక్క ఈ ఆలయాన్నే కాకుండా ఇరుగు లింగేశ్వర స్వామి దేవస్థానం కూడా దర్శించుకొనేందుకు వీలుగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టుటకు ప్రణాళికలు రూపొందించారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే పుత్తూరు హైవేకు దగ్గర అవుతుంది. దాంతో చెన్నై వెళ్ళే భక్తులకు అనుకూలంగా ఉంటుంది. ఈ పరిశీలనలో ఆలయచైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## చక్కటి ఏర్పాట్లు: స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు

### చైర్మెన్ చొరవ: భక్తుల ప్రశంశ



**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాల్లో ద్రౌపదీసమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవాలకు ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్,ఇఒ బికె వవెంకటేశులు ప్రత్యేక శ్రద్ధ వహించారు. వచ్చిన భక్తులకు ఆలయం తరఫున ఉచితంగా లడ్డు ప్రసాదాన్ని అందించారు. మూడు రోజులుగా ఆలయం వద్దనే తిష్టవేసి ఓ వైపు దుర్యోధన దుశ్శాసన వధ, మరో వైపు పొంగళ్ళకు ఏర్పాట్లు చేసారు. అలాగే పోలీసులతో చర్చించి ట్రాఫిక్‌ను మళ్ళించుటకు చొరవచూపారు. అంతేకాక ఉత్సవాలలో సమయపాలనకు ప్రాధాన్యత ఇచ్చారు. ధర్మరాజుల స్వామి తిరునాళ్ళు సందర్భంగా నిర్వహించే అగ్నిగుండ ప్రవేశానికి గతంలో సువర్ణముఖి నదిలో స్నానమాచరించే వారు. అయితే అది దూరం కావటంతో దేవస్థానం ఇఒ బికె వవెంకటేశులు భక్తుల సౌకర్యార్థం వైష్ణవ కోనేరులో ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అయితే ఇక్కడ ముందుజాగ్రత్తగా దేవస్థానం బోర్డులు ఏర్పాటు చేసింది. కోనేరులో దిగరాదని గట్టు మీద సా న్నాలు ఆచరించాలని సూచనల బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ కోనేరులో ఏర్పాటు ఎంతో ఉపయోగకరంగా మారింది.

**మహిళలకు ప్రవేశం:**
గతంలో ధర్మరాజుల తిరునాళ్ల సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం రోజు మహిళలకు అగ్ని స్నానమాచరింపజేశారు. కొందరు మొక్కులు తీర్చుకోటానికి మరికొందరు సంతానం కోసం అగ్ని స్నానమాచరించే వారని వృద్ధులు చెబుతున్నారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సంప్రదాయాల్లో కూడా మార్పులువచ్చాయి. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కాబట్టి అగ్నిగుండ ప్రవేశానికి ఎందుకు అనర్హులని భావించి వారికి కూడా ప్రవేశం కల్పించారు. దాంతో ఆదివారం మహిళలు విశేషసంఖ్యలో పాల్గొన్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు:**
ధర్మరాజుల స్వామి బ్రహ్మోత ్స వాల్లో భాగంగా అర్జున తపస్సు రోజు నుంచి పట్టణంలో జనం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం కల్గకుండా మందు జాగ్రత్త చర్యగా డివైయస్‌పి నరసింహామూర్తి ఆదేశాలతో డివిజన్‌లోని సిఐ లు నాగరాజు,వెంకటేశ్వర్లు వారి సిబ్బంది పోలీసులు ఉదయం నుంచి చెన్నై నుంచి వచ్చే బస్సులను సాయిబాబ మందిరం వద్ద నుంచి ఆస్పత్రి మీదుగా మళ్లించారు. కెవిబిపురం నుంచి వచ్చే బస్సులను కళాశాల వద్దనే నిలిపివేశారు. తిరుపతి వైపు నుంచి వెళ్లే బస్సులను అయ్యలనాడు చెరువు వైపు మళ్లించారు.

## బిజెపి సారధ్యంలో సర్ వర్క్‌షాప్



**తొట్టంబేడు,జూలై 26 ప్రభాతవార్త**
శ్రీకాళహస్తి నియోజకవర్గం ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమాలు పూర్తి అయ్యాయని కాబట్టి ఖరారు చేసిన ఓటర్ల జాబితాల్లో పేర్లను సమగ్రంగా పరిశీలించుటకు రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ తమ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం పట్టణ పొలిమేరల్లోని ఎన్‌వియస్ కళ్యాణమండపంలో జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి సారధ్యంలో పరిశీలనకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ అధికారుల నుంచి ఓటర్ల జాబితాలను సేకరించి పరిశీలించాలన్నారు. నిజమైన ఓటర్లకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఈ నెల 31న భారీ ఎత్తున సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా బిజెపి జెండాను ఆవిష్కరించారు. బూత్‌లెవల్ ఏజెంట్2 వర్క్‌షాప్‌ను విజయవంతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రదాన కార్యదర్శి బిడిబాలాజి, మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ ప్రముఖులు హాజరయ్యారు.

## దేవస్థానం నుంచి సారె బహూకరణ



**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవాలకు ఆదివారం ఆలయం నుంచి సంప్రదాయబద్ధంగా సారె అందించే కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిం చారు. ఆలయ ఆవరణ నుంచి మేళ తాళాలు మంగళవాయిద్యాలతో ద్రౌపదమ్మకు అందించే సారెను ఆలయాధికారులు, నాయకులు కలసి సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఆలయ ఇఒ వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి,ఎంఎస్‌రెడ్డి, ఆలయ డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, చిరంజీవి, ఇఇ శ్రీనివాసులు రాజులు,చిన్నఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య,రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.



**ఎటు చూసినా దుకాణాల సందడే!**
పట్టణంలోని బిక్షాల గాలిగోపురం నుంచి ధర్మరాజుల గుడి వరకు సుమారుమూడు కిలో మీటర్ల వరకు పూలదుకాణాలు, వివిధ ఆట వస్తువుల దుకాణాలు, రకరకాల మజిలి దుకాణాలు ఉన్నాయి. అంతేకాక వినోదం కోసం పలు సర్కస్‌లు, రంగుల రట్నాలు రావడంతో ఇదో మేళగా మారింది. అంతేకాక నిర్వహకులు కూడా పట్టణానికి వచ్చే భక్తులక ఎలాంటి అసౌకర్యం కల్గకుండా వివిధ జాగ్రత్తలు తీసుకున్నారు. దుకాణాలు సందడిగా మారాయి. అయితే ఎవరికి ఏ ఇబ్బంది కల్గకుండా ఆలయ సిబ్బంది చక్కటి ఏర్పాట్లు చేసి ప్రశంసలందుకున్నారు. అగ్నిగుండ కార్యక్రమాల్లో ఎలాంటి విఘ్నాలు,ఇబ్బందులు ఏర్పడకుండా ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ ఇఒ బికె వెంకటేశులు, ఇఇ శ్రీనివాసులు రాజు వారి సిబ్బంది పర్యవేక్షించారు.

## పూర్ణాహుతి:అగ్నిగుండ వెలుగు

**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాలు చివరి రోజు ఎడతెరపిలేని కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఆదివారం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీకాళహ స్తీశ్వరాలయం నుంచి జయరామరావు వీధి పొడవునా అరటి చెట్లతో ముస్తాబు చేసారు. తరువాత ఆలయంలోని యాగశాలలో ఏర్పాటు చేసిన పూర్ణాహుతి కార్యక్రమాల్లో ఆలయ అధికా రులు,పాలకులు పాల్గొన్నారు. ఇక్కడ నుంచి ఆలయ పూజారి పురుషోత్తం నిప్పుకణికలను పూలలో వేసుకొని భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం వద్దకు వచ్చి వెలిగించారు. ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, సభ్యుడు వాకచర్లగుర్రప్పశెట్టి, ఎంఎస్‌రెడ్డి,నాగరాజు,డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, చిన్నఆలయాల ఎఇఒ హేమామాలిని,పర్యవేక్షకులు లక్ష్మయ్య, ఎఇఒలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పౌరోహితులు అర్ధగిరి, ఉత్సవాల ఇన్‌చార్జిలు సుబ్రమణ్యం, దుర్గా ప్రసాద్‌లు పాల్గొనగా సంప్రదాయ బద్ధంగా అగ్నిగుండం వెలిగించారు. పాల్గొన్న వారు అగ్నిగుండంలో నేతిని సమర్పించారు. ఆలయ పూజారి పురుషోత్తం వెలిగించారు.

## శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి



**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త**
శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. ఈ నేపథ్యంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుం బసభ్యులతో రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటో కాల్ ఎఇఒ లోకేష్‌బాబు,ఎపిఆర్‌ఒ రవిలు కోర్టు ప్రోటోకాల్ అధి. కారి రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును ఆలయ పర్యవేక్షకులు సి.నాగభూషణయం యాదవ్,టెంపుల్‌ఇన్స్పెక్టర్ వవెంకటస్వామి, హరియాదవ్‌లు పర్యవేక్షించారు. లోకేష్‌బాబు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## అగ్నిగుండంకు ప్రదక్షిణలు



**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త**
ఇక్కడి ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆది వారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయంలోని మూలవిరాట్టులకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన అనుచరులతో రాగా గర్భగుడిలో పూ జారి పురుషోత్తం వారికి అర్చనలు జరిపారు. ఆశీర్వదిస్తూ తీర్థ ప్రసాదాలు అందించారు. తరువాత వారు అగ్నిగుండంను ప్రదక్షిణలు చేసి పూజలు జరుపుకున్నారు. ఆయనతో పాటు సురేష్, మెగరాల గణేష్, అంజూరువెంకిరాయల్, కుమార్‌ప్రసాద్‌సాయి, అశోక, ధన, కళ్యాణ్, నేతాజి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# వాస్కులర్ సమస్యల్లో నిర్లక్ష్యం ప్రమాదం

## – ఆపరేషన్ లేకుండానే అత్యాధునిక చికిత్సలు అందుబాటులో డాక్టర్ బాలాజీ వెల్లడి




**తిరుపతి హెల్త్, జూలై 26, ప్రభాతవార్త**
రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని చెన్నై అపోలో ఆస్పత్రికి చెందిన సీనియర్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ బాలాజీ అన్నారు. ఆదివారం స్థానిక తుడా రోడ్డులోని అపోలో క్లినిక్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్కులర్ వ్యాధుల లక్షణాలు, ఆధునిక చికిత్సల గురించి వివరించారు. కాళ్లలోని సిరలు ఉబ్బి,మెలికలు తిరిగి కనిపించడాన్ని వెరికోస్ వెయిన్స్ అంటారని, ఎక్కువసేపు నిలబడి పనిచేసే పోలీసులు, బస్సు కండక్టర్లు, వైద్యులు, ఉపాధ్యాయులు, మహిళల్లో ఇది సాధారణంగా ఉంటుందన్నారు. ఇప్పుడు పెద్ద ఆపరేషన్ అవసరం లేకుండా లేజర్ పద్ధతితో చికిత్స చేయవచ్చు. కొన్ని గంటల ప్రక్రియతో అదే రోజు ఇంటికి వెళ్లే అవకాశం ఉందన్నారు. సిరల్లో రక్తం గడ్డకట్టడం వల్ల వచ్చే డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (డివిటి)ను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. కాళ్లలోని గడ్డ ఊపిరితిత్తులకు చేరితే పల్మనరీ ఎంబోలిజం వచ్చి ప్రాణానికి ముప్పు కలగవచ్చని, ఆ లక్షణాలు కనిపించిన వెంటనే వాస్కులర్ నిపుణుడిని కలవాలని సూచించారు. మందులు, ఇంజెక్షన్లు, అవసరమైతే ఐవిసి ఫిల్టర్ ద్వారా చికిత్స అందుబాటులో ఉందన్నారు. కాళ్లకు రక్తం సరఫరా చేసే ధమనుల్లో అడ్డంకులు ఏర్పడటాన్ని పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ అంటారని, నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి, తిమ్మిర్లు వస్తాయి. ఈ వ్యాధి ముదిరితే "గ్యాంగ్రీన్" వచ్చి కాలు తొలగించాల్సి న పరిస్థితి కూడా ఏర్పడవచ్చు అన్నారు. షుగర్, ధూమపానం, అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారిలో ఈ ప్రమాదం ఎక్కువ అన్నారు. 90 శాతం మందికి ఆపరేషన్ లేకుండా లేజర్ ట్రీట్మెంట్ ద్వారా వాస్కులర్ వైద్యంలో ఎండోవాస్కులర్ విప్లవం వచ్చిందన్నారు. గుండె యాంజియోప్లాస్టీ తరహాలోనే కాళ్ల ధమనుల్లో వైర్, బెలూన్, స్టెంట్ ద్వారా బ్లాకులను తొలగిస్తున్నారు. 90 శాతం కేసుల్లో ఓపెన్ సర్జరీ అవసరం లేదు. దీర్ఘకాల మధుమేహంతో ధమనుల్లో కాల్షియం పేరుకుపోయి గట్టిపడితే ఇంట్రావాస్కులర్ లిథోట్రిప్సీ సాంకేతికతతో చికిత్స చేస్తున్నారు. ప్రత్యేక బెలూన్ ద్వారా కాల్షియంను బద్దలు చేసి స్టెంట్ వేయడానికి అనుకూలంగా మారుస్తారన్నారు. మెదడుకు రక్తం తీసుకెళ్లే కరోటిడ్ ధమనుల్లో బ్లాక్ వల్ల స్ట్రోక్ వస్తుంది. తద్వారా అకస్మాత్తుగా మాట తడబడటం, ఒకవైపు బలహీనత, దృష్టి మసకబారడం వంటివి మైనర్ స్ట్రోక్ సంకేతాలని తెలిపారు. వెంటనే సిటీ యాంజియోగ్రామ్, స్కానింగ్ చేయించుకోవాలన్నారు. షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, ధూమపానం ఉన్నవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. కాళ్ల నొప్పి,వాపు, నరాలు ఉబ్బడం, నడిచినప్పుడు నొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. వాస్కులర్ సమస్యలను ముందుగానే పట్టుకుంటే జీవితం సులభం. ఆలస్యం చేస్తే అవయవ నష్టంతో పాటు ప్రాణానికే ముప్పు వాటిల్లుతుందని డాక్టర్ బాలాజీ హెచ్చరించారు.

## విశ్వబ్రాహ్మణ సంఘంచే అన్నదానం



**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త**
శ్రీకాళహస్తి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం తరఫున ఆదివారం పిచ్చాటూరు రోడ్డులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ధర్మరాజుల బ్రహ్మోత్సవాల సందర్భంగా పేదలు, ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులకు అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమాల్లో సంక్షేమ సంఘం నేతలు మోహనాచ్చారి, చంద్రాచారి, వెంకటేష్ ఆచారి, రమేష్‌ఆచారి, హరికృష్ణ ఆచారి, జానకి రామాచారి, కాంతారావుఆచారి, మధావాచ్చారి,కిషోర్ ఆచారి, కుప్పయ్య ఆచారి, రామకృష్ణాచ్చారి, తదితులు పాల్గొన్నారు.

27CTR6:27CTR6.qxd 7/26/2026 11:16 PM Page 1



# ప్రజా దర్బార్‌తో పరిష్కారం లభించేనా!?




ప్రభాతవార్త-తిరుపతి:

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజా దర్బార్లు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు క్రమం తప్పకుండా ప్రజా దర్బార్లు నిర్వహిస్తూ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నప్పటికీ, వాటిలో ఎన్ని పరిష్కరించబడ్డాయన్న దానిపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలతో పాటు డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు,సిసి రోడ్లు, పారిశుద్ధం తదితర సమస్యలపై ప్రజలు పెద్ద సంఖ్యలో వినతులు సమర్పిస్తున్నారు. అయితే వినతులు స్వీకరించిన అనంతరం వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ, ఫాలోఅప్ లేకపోవడంతో ప్రజా దర్బార్లు కేవలం వినతుల స్వీకరణ కార్యక్రమాలుగా మిగిలిపోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

గతంలో తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న సుగుణమ్మ పలుమార్లు ప్రజా దర్బార్లు నిర్వహించినా చెప్పుకోదగిన స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజలు పేర్కొంటున్నారు. అలాగే తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి తదితరులు నిర్వహించిన ప్రజా దర్బార్లలోనూ ఇదే పరిస్థితి నెలకొందని అంటున్నారు.

**జేబీ శ్రీనివాస్ శనివారం ఉదయం ఇన్‌ఛార్జి హోదాలో తొలి ప్రజా దర్బార్**

తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ డివిజన్లకు సంబంధించిన డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పారిశుద్ధం తదితర సమస్యలపై అర్జీదారులతో నేరుగా మాట్లాడి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యల పరిష్కారం కోసం అధికారులతో ఫోన్లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా నిచ్చారు.అయితే ప్రజా దర్బార్‌లో స్వీకరించిన ప్రతి వినతికి పరిష్కారం చూపేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వినతులు స్వీకరించడం, అధికారులకు ఫోన్ చేయడంతో కార్యక్రమం ముగియకుండా, సమస్య పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తేనే ప్రజా దర్బార్లకు సార్థకత ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# తిరుపతి డివిజన్

### చేనేత రంగ అభివృద్ధికి

## ప్రగడ కోటయ్య కృషి

### - అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్



చిత్తూరు, జులై 26 ప్రభాతవార్త: రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి ప్రగడ కోటయ్య అలుపెరుగని కృషి చేశారని అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్ అన్నారు. కలెక్టరేట్‌లోని వివేకానందభవన్‌లో ఆదివారం ప్రగడ కోటయ్య జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రగడ కోటయ్య దేశం, రాష్ట్రంకు అందించిన సేవలు అసమానమని కొనియాడారు. 1942 నుండి స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా 1945లో మహాత్మాగాంధీ ఆశీస్సులతో నాగపూర్‌లో స్థాపించబడ్డ ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శిగా ఆయన సేవలు అందించారన్నారు. అలాగే చేనేతల సమస్యల పరిష్కారానికి నాలుగు చేనేత సత్యగ్రహ ఉద్యమాలు నిర్వహించిన పోరాట యోధుడని, ఆయన ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యులుగా చట్టసభల్లో చేనేత వాని వినిపించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200లకు పైగా చేనేత సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగలు, నగదు కోసం వృద్ధురాలు హత్య

### - నిందితుడు అరెస్ట్, రూ.12 లక్షల విలువ కలిగిన బంగారు, ద్విచక్ర వాహనం స్వాధీనం

### - ఎన్ని మారు వేషాలు వేసినా తప్పించుకోలేరు :- జిల్లా ఎస్పి సుబ్బరాయుడు





తిరుపతి క్రైమ్, జూలై 26, ప్రభాతవార్త

తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి సాయినగర్ పంచాయతీలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలను హతమార్చి నగలు, నగదు దోచుకు నిందితుడు పరారు అయిన ఘటన ఈ నెల 14వ తారీకు చోటు చేసుకున్న సంగతి విధితమే. పెద్ద ప్రణాళికతో ఉద్దేశపూర్వకంగా నిందితుడు చోరీ, హత్యకు పాల్పడటంతో ఈ కేసుని తిరుపతి ఎస్పి సుబ్బారాయుడు ప్రత్యేకంగా తీసుకుని చేదించి నిందితున్ని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఎస్పీ కార్యాలయంలో పాత్రికేయ సమావేశంలో తిరుపతి ఎస్పి సుబ్బారాయుడు సమాచారం మేరకు నేరస్థుడు పాశం రూపేష్ కుమార్, వయసు 36 సంవత్సరాలు, గుడిపల్లిపాడు గ్రామము, నెల్లూరు రూరల్ మండలం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా రైల్వే శాఖలో లోకో పైలట్‌గా కృష్ణపట్నం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తనకున్న అప్పులు సమస్యల ద్వారా బంగారు ఆభరణాలు చోరీ చేసి వాటిని అమ్ముకునే జీవన సాగించేవాడు. ఈ క్రమంలో తిరుపతి రూరల్ సాయి నగర్ పంచాయతీలో నివసిస్తున్న వృద్ధురాలు జ్యోతి వయసు 69 తో పాత పరిచయాన్ని ఆసరా చేసుకుని ఆమెను నమ్మించి ఈ నెల 14వ తారీకు ఆమెను హతమార్చి 90 గ్రాములు బంగారు, 47 వేల రూపాయిలు నగదు అపహరించి పరారయ్యాడు. అనంతరం ఎస్పి ఆదేశాలతో ప్రత్యేక బృందంగా ఏర్పడిన అధికారులు సాంకేతిక ఆధారాలతో కేసులు చేదించారు. మారువేషం ధరించి,దొంగలించిన స్కూటీతో నెంబర్ ప్లేట్లు మార్చి, ముసుగు ధరించి, హెల్మెట్ వేసుకుని పక్కా ప్రణాళికతో కేసు నుంచి తప్పించుకోవాలనే దురుద్దేశంతో ఉద్దేశపూర్వకంగా హత్య చేసిన నిందితుని ఛేదించి కృష్ణపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో నిందితున్ని అరెస్టు చేశారు. అనంతరం తన వద్ద ఉన్నటువంటి 12 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు మరియు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తనపై సంబంధిత కేసులలో నమోదు చేసి సాక్షాదారాలతో కోర్టుకి హాజరు పరచనున్నారు.

**ఎన్ని మారువేషాలు వేసిన చట్టం నుండి తప్పించుకోలేరు. ఎస్పి**

ఎన్ని మారువేషాలు వేసిన, చట్టాన్ని తప్పు దోవ పట్టించాలని ఎన్ని కుట్రలు చేసిన నేటి సాంకేతిక యుగంలో ఏ ఒక్క నేరసుడు తప్పించుకోలేడని నేరాలు చేయాలని ఆలోచన ఉన్నవారిని హెచ్చరించారు. అదేవిధంగా వృద్ధులు రిటైర్డ్ ఉద్యోగులు ఒంటరిగా జీవించేవారు తప్పనిసరిగా తమ నివాసంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా నేరస్తులు నేరాలు పాల్పడటానికి సంకోచిస్తారని నేరాల అనంతరం నేరస్తుని త్వరితగతిన చేదించడానికి సహకారంగా ఉంటుందని సూచించారు. ఈ కేసు దర్యాప్తులో అడిషనల్ ఎస్పి శ్రీనివాసులు, రవి మనోహర్ ఆచారి, డిఎస్పి ప్రసాద్, పర్యవేక్షణలో తిరుపతి రూరల్ ఇన్స్పెక్టర్ మద్దయ్య చారి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్ రెడ్డి, అబ్బన్న, ఎస్పైలు శ్రీరాములు, జ్యోతి, నాగర్జున రెడ్డి, చిరంజీవి, ఐడి పార్టీ సిబ్బంది లక్ష్మి, ప్రసాద్, గౌస్ ఆరిఫ్, సూర్యప్రసాద్, ప్రభాకర్, ప్రసాద్, శ్రీనివాసులు, రమేష్, నాగరాజు శెట్టి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య విజయం: కాంగ్రెస్ సంబరాలు



తొట్టంబేడు,జూలై 26 ప్రభాతవార్త

నీట్ పరీక్ష పత్రాల లీకేజీలో విద్యార్థులకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసారని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి తలపాదామోదర్‌రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆదివారం ఆర్‌టిసిబస్టాండులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నేడు ప్రజాస్వామ్యంలో విలువలు కనుమరుగౌతున్నాయన్నారు. భారత దేశ భవిష్యత్తు విద్యార్థులేనని అలాంటి విద్యార్థుల పోటీ పరిక్షల్లో అన్యాయం జరిగిందన్నారు. ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థుల జీవితాలు అంధకారమయ్యాయన్నారు.ఈ సంబరాల్లో దామోదర్‌రెడ్డి తో పాటు కరీముల్లా, శ్రీను గౌడ్ సురేంద్రరెడ్డి, ఆంటోని, యానాది నవీన్,కిరణ్, శ్వేత, విజయ్, రమేష్, నాగూరయ్య,సుధాయాదవ్,ప్రసాద్,దిలీప్, నిజాముద్దిన్ నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెప్,సారధి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అగ్నిగుండప్రవేశం



కార్వేటినగరం,జూలై 26 ప్రభాతవార్త:

కార్వేటినగరంలో శ్రీద్రౌపదిదేవి సమేత ధర్మరాజులస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా అగ్నిగుండం ప్రవేశం నిర్వహించారు.ఉదయం స్కంధపుష్కరిణి నుండి తీర్థం తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.ఉదయం 10.30గంటలకు అగ్నిగుండాన్ని ప్రారంభంకు కర్పూరం వెలిగించారు. 500 రూపాయిలు రుసుము చెల్లించి యువత,పెద్దలు,చిన్నారులు కంకణాలు ధరించి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.అగ్నిగుండం ప్రవేశం చేసేవారు పలుబావులలో స్నానమాచరించి స్కంధపుష్కరిణి వద్దకు చేరుకున్నారు.భక్తులు పసుపు బట్టలు ధరించి గోవిందనామస్మరణాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు.అర్చకులు అగ్నిగుండానికి చేయవలసిన పూజలు నిర్వహించి వరుసక్రమంలో అగ్నిగుండం ప్రవేశం జరిగేలా చూశారు.కట్టుదిట్టమైన ఏర్పాట్లను కార్వేటినగరం సి.ఐ హనుమంతప్ప,యస్.ఐ తేజస్విని,పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మేళం రవియాదవ్,బలిజకులస్థుల తోట విజియులునాయుడు కుమారులు,కమిటీ సభ్యులు,పాల్గొన్నారు.

## నాపై అక్రమ కేసులు : మాజీ మంత్రి రోజా



పుత్తూరురూరల్, జూలై 26 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తనపై అక్రమ కేసులు నమోదు చేసి నోటీసులు జారీ చేసిందని మాజీమంత్రి రోజా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగ బద్ధమైన హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకే కూటమి ప్రభుత్వం ఇటువంటి వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. బెదిరింపులకు, అక్రమ కేసులకు వైసీపీ భయపడదని, ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## తొట్టంబేడు నుంచి ఇంటింటికి సుధీరన్న



తొట్టంబేడు,జూలై 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇంటింటికి సుధీరన్న కార్యక్రమాలను సోమవారం సాయంత్రం 4గంటలకు శ్రీకారం చుడుతున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు ఆదివారం మీడియాకు తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు,ఎన్నికల కార్యక్రమాలను బొజ్జల కుటుంబం ఈశాన్యం నుంచి శ్రీకారం చుట్టడం ఆనవాయితి.ఈ నేపధ్యంల 30రోజుల ఇంటింటికి సుధీరన్న కార్యక్రమాలను తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగ గుండెలు గుంట నుంచి ప్రారంభిస్తున్నారు. ౦రెండేళ్ళపరిపాలనకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలతో ఈ కార్యక్రమాలను రూపొందించారు. నాలుగు రోజుల పాటు మండలంలో విస్తృతంగా సాగా కార్యక్రమాల్లో 2 సంవత్సరాల నమ్మకం అభివృద్ధి సంక్షేమంను ప్రజలకు వివరించుటకు రూపొందించిన ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన సూపర్ సిక్స్‌కు సంబంధించి ప్రజలకు వివరించనున్నారు.అంతేకాక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కీలకమైన తొట్టంబేడు మండలంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించునున్నారు.అలాగే ప్రజా సమస్యలు,సూచనలను తెలుపు 'మై టిడిపియాప్' ద్వారా నమోదుకు సంబంధించిన అవగాహనకల్పించుటకు ఈ సమావేశాల్లో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

## ఘనంగా రామాంజులనాయుడు జన్మదిన వేడుకలు

**కేవీబీపురం, జూలై 26 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, తొట్టంబేడు మార్కెట్ కమిటీ చైర్మన్ రామాంజులనాయుడు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రాజులకండ్రిగలోని ఆయన నివాసం వద్ద టీడీపీ మండల నేతలు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బాణసంచా పేల్చి భారీ కేక్ కట్ చేశారు. రాష్ట్ర రైతు విభాగం నాయకుడు గోపినాథ్‌రెడ్డి, అవసరం సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున యువత రామాంజులనాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన తనయుడు సుమన్ కుమార్ రామాంజులనాయుడు ఇంటికి చేరుకుని జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

## ఆహారం,ఆలోచన,ఆరోగ్యంపై అవగాహన




తొట్టంబేడు,జూలై 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రోటరీ క్లబ్ సారధ్యంలో ఆదివారం ఆహారం,అలోచన, ఆరోగ్యంకు సంబంధించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు నేచురోతి ప్రచారకులు యోగా మాస్టర్ పోచినేని సురేష్‌నాయుడు ముఖ్యఅతిధిగా హాజరై అవగాహన కల్పించారు. సమావేశానికి రోటరీ అధ్యక్షులుమల్లెమాల ప్రమీల అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా నేడు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించుటకు యోగా మాస్టర్ సురేష్‌నాయుడును ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజయోగ జీవన విధానంతో సర్వరోగాలకు దూరంగా ఉండవచ్చునని వివరించారు.ఆహార,విహార,వ్యవహార, విశ్రాంతి నియమాలు పాటిస్తూ యోగా ప్రాణాయాలను క్రమం తప్పకుండా చేస్తే దీర్ఘకాలిక వ్యాధి రహితంగాజీవించవచ్చునని వివరించారు. సభ్యులతో కలసి ప్రాణాయామం హర్ట్‌ఫుల్ నేస్ రిలాకేస్షన్ ప్రక్రియను ఆచరించి చూపారు.ఈ కార్యక్రమాల్లో అధ్యక్షులు ప్రమీలతోపాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మ్యాగీక్లారా, మాజీ అధ్యక్షులు ఓరుగొండ వేణుగోపాల్,, స్పీకర్‌బ్యాంక్‌చైర్మెన్ పిళ్ళారి బత్తినయ్యశెట్టి, రిటైర్డ్ సెంట్రల్‌బ్యాంకు మేనేజర్ వెంకటముని,వాకచర్ల భార్గవ మూర్తి, అర్‌కె ప్రసాద్, డాక్టర్ వెంకటరామన్, శ్యామ్‌జి, కుసుమగణేష్, కళ్యాణి,చంద్రప్ప,కండ్రిగ ఉమ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రోటరీ సారధ్యంలో సురేష్‌నాయుడును సత్కరించారు.

## వైభవంగా బాల గురప్పస్వామి జాతర

చిన్నగొట్టిగల్లు, జూలై 27 ప్రభాతవార్త

చిన్నగొట్టిగల్లు మండలం లంకిపల్లివారిపల్లి గ్రామంలో శ్రీ బాల గురప్పస్వామి జాతర మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జాతరకు హాజరుకాగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారిని దర్శించుకున్న మోహిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయ మర్యాదలతో సత్కరించిన కమిటీ సభ్యులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన లంకిపల్లి గుర్రప్ప నాయుడు, గాయత్రి దంపతుల కుమార్తె కేశఖండన కార్యక్రమానికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, మాజీ సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన్, శంకర్‌రెడ్డి, బాబి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుధాకర్, సీతాపతి, మునిరాం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

